ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
5
శ్రీకాకుళం



'బొల్లినేని'లో చైల్డ్ కేర్ టేకర్ శిక్షణ

శ్రీకాకుళం రూరల్ : నిరుద్యోగ, ఒంటరి మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చైల్డ్ కేర్ టేకర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు చేసేందుకు 18 నుంచి 38 ఏళ్ల లోపు వయసు గల మహిళలు అర్హులని, ఎనిమిదో తరగతి చదివిన వారు ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ హాస్పిటల్స్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ బైపిసి ఉత్తీర్ణులైన వారికి బిఎస్సి పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పూర్తి వివరాలకు 76809 45357, 9131969654 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉదాసీన వైఖరి

- సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి
- కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా



ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వ ఉదాసీన వైఖరి తగదని ఎపి ఎన్జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జెఎసి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం అన్నారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పెన్షనర్లు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం వారు మాట్లాడుతూ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కనీస పెన్షన్తో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అమలు చేయాలని కోరారు. 2018 నుంచి డిఎ బకాయిలు 2022 నుంచి ప్రభుత్వం నుంచి రావాల్సిన పిఆర్సి ఎరియర్స్ బకాయిలు ఏకమొత్తం విశ్రాంత పెన్షనర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పెన్షనర్లు చేపట్టే ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రామచంద్రరావు, ఎ.ధర్మారావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరల నేపథ్యంలో పెన్షన్ కోసం ఎదురుచూసే పరిస్థితులు కల్పించవద్దన్నారు. పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పూర్తి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇహెచ్ఎస్ ద్వారా ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకునేందుకు అనుమతించాలని కోరారు. ధర్నాలో ఎన్జిఒ అసోసియేషన్ నాయకులు ఆర్.వేణుగోపాల్, బి.పూర్ణచంద్రరావు, ఎస్జిపిఎ శ్రీకాకుళం అసోసియేషన్ కోశాధికారి బొడ్డేపల్లి మోహనరావు, మహిళా విభాగం అధ్యక్షులు ఎం.ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్ ఎన్.వి.రమణ, జాయింట్ సెక్రటరీ ఢిల్లేశ్వరరావు, బి.సూర్యప్రకాష్, జి.వి.రమణ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

జీడి గిట్టుబాటు ధర హామీ ఏమైంది?

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- టిడిపి వైఖరి స్పష్టం చేయాలి
- వామపక్ష నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వం జీడి గిట్టుబాటు ధర ఎందుకు ప్రకటించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, వంకల మాధవరావు, లిబరేషన్ పార్టీ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు మాట్లాడారు. గిట్టుబాటు ధర కోసం జీడి రైతులు ఏడాది కాలంగా పోరాటం చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. జీడికి గిట్టుబాటు ధరపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ప్రతిరోజూ దుమ్మెత్తిపోసుకుంటున్న వైసిపి, టిడిపి నాయకులు జీడి గిట్టుబాటు ధరపై మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. పలాస పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా చర్చించి గిట్టుబాటు ధర ప్రకటిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం జీవనాడైన జీడి రైతుల పక్షాన ఉంటుందా?, దళారుల పక్షాన ఉంటుందా? చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిపప్పు ధర రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతుంటే, జీడిపిక్క ధర పాతాళానికి పోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ వలే జీడి కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని, స్థానిక జీడిపిక్కలు పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతించాలన్నారు. విదేశీ పిక్కలు దిగుమతికి అధిక సుంకాలను పెంచాలని, జీడీ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు చాపర వేణు, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, లిబరేషన్ పార్టీ నాయకులు పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు రీజనల్ మెగా జాబ్మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఈనెల 31వ తేదీన విజయనగరం సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో రీజనల్ జాబ్మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహించే జాబ్మేళాకు ఐటి, ఫార్మా, మాన్యుఫ్యాక్టరింగ్, బ్యాంకింగ్, రిటైల్, ఆటోమొబైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, టెక్స్టైల్స్, కన్స్ట్రక్షన్, కాస్మోటిక్స్, సర్వీస్, టూరిజం, హాస్పిటాలిటీ తదితర రంగాల కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేళాలో 82 కంపెనీల్లో 5,849 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://www.skilluniverse.apssdc.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబరుతో పాటు రెజూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, పాస్పోర్టు సైజ్ ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 80994 61303, 79898 26953, 90147 65287 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'స్పందన'కు 318 వినతులు

శ్రీకాకుళం అర్బన్ : సముద్ర తీర ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యాన పెద్దఎత్తున సరుగుడు తోటల పెంపకం రెండు దశాబ్దాలుగా సాగుతోందని, వన సంరక్షణ సమితుల పర్యవేక్షణలో ఉన్న ఈ తోటల్లో తలదాచుకుంటున్న వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని వత్సవలస వనసంరక్షణ సమితి సభ్యులు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ను కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 318 వినతులు వచ్చాయి. కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురానికి చెందిన వృద్ధులు డోకి హరినాథం, లక్ష్మీకాంతం తమ కుమారులపై ఫిర్యాదు చేశారు. పిత్రార్జితంగా ఉన్న తన ఇంట్లోకి వెళ్లనీయకుండా కుమారుడు ఏడుకొండలు అడ్డుకుంటున్నారని, తమకు ఆశ్రయం కల్పించడం లేదని వాపోయారు. సాంఘిక సంక్షేమశాఖలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని, వంట పనివారు, వాచ్మెన్లకు పని భద్రత కల్పించాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని గూనపాలెం చెరువుగట్టు వీధిలో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాలను అక్కడ్నుంచి తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని కోరుతూ పలువురు మహిళలు వినతిపత్రం అందించారు. వీటితో పాటు పలు సమస్యలపై వచ్చిన వినతులను జెసితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, డిఆర్డిఎ పీడీ విద్యాసాగర్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, డిఎస్ఒ వెంకటరమణ, డిఇఒ వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనేతరులను ఎస్టిలుగా గుర్తించవద్దు

- జిల్లాలో బెంతు ఒరియాలు లేరు
- ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కె.మధు
- గిరిజనుల చలో టెక్కలి ర్యాలీ



చలో టెక్కలి ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి - టెక్కలి

జిల్లాలో బెంతు ఒరియాలు లేరని ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు అన్నారు. జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్టిలుగా గుర్తించవద్దని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన గిరిజనులు చలో టెక్కలి ర్యాలీని సోమవారం నిర్వహించారు. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని వారికి ఎస్టి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకూడదని తెలియజేస్తూ సోమవారం టెక్కల్లో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక తెంబూరు రోడ్డు నుంచి సబ్ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ జంక్షన్లో మానవహారం నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బెంతు ఒరియాల పేరుతో ఉన్న నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బెంతు ఒరియాల పేరుతో బిసి-ఎకి చెందిన వడ్డి కులస్తులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రెండు వేల నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు పొంది పలు ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. వారందరినీ ఉద్యోగాల నుండి తొలగించి సర్టిఫికెట్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటి స్థానంలో నిజమైన ఆదివాసీలకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర సహాధ్యక్షులు వాబ యోగి మాట్లాడుతూ ఆదివాసీల మనుగడకు ముప్పు పొంచి ఉందన్నారు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఆదివాసీలను దగా చేస్తూ గిరిజనేతరులను ఎస్టి జాబితాలో చేరుస్తామని తప్పుడు వాగ్దానాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని గతంలో టెక్కలి ఆర్డిఒ ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారని తెలిపారు. రాజకీయ నాయకులు చేస్తున్న తప్పుడు వాగ్దానాలు, నకిలీ బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు బూటకమన్నారు. ఆదివాసీలు సంఘటితమై ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు గురాడ అప్పన్న, కార్యదర్శి బైదలాపురం సింహాచలం, యడ్ల సూర్యనారాయణ, ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, బి.భాగ్యలక్ష్మి, ఆనందరావు, చింతపల్లి భాస్కర్, బెజ్జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎస్ఐల బదిలీలు

40 మందికి స్థానచలనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా ఎస్ఐల బదిలీలు జరిగాయి. విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 40 మందికి స్థానచలనం కలిగింది. ఈమేరకు ఎస్పి జి.ఆర్ రాధిక సోమవారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.కృష్ణప్రసాద్	సరుబుజ్జిలి	గార
బి.అశోక్బాబు	బూర్జ	నరసన్నపేట
పి.సిద్ధార్థ కుమార్	విజయనగరం	సంతబొమ్మాళి
ఎం.హరికృష్ణ	వి.ఆర్ శ్రీకాకుళం	ఎస్ఐ-1, శ్రీకాకుళం టూటౌన్
ఎస్.కె ఖాదర్బాషా	ఎస్ఐ-1 కాశీబుగ్గ	పొందూరు
జి.ప్రభాకరరావు	డిపిటిసి, శ్రీకాకుళం	దిశా పిఎస్
సిహెచ్.స్వామినాయుడు	విఆర్, శ్రీకాకుళం	లావేరు
ఎల్.చంద్రశేఖర్	విశాఖ సిటీ	బారువ
బి.అనిల్కుమార్	విఆర్, శ్రీకాకుళం	మందస
ఎం.ప్రవల్లిక	విఆర్, శ్రీకాకుళం	దిశా పిఎస్
హేమంత్ కుమార్	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి, శ్రీకాకుళం
కె.వెంకటేష్	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్, శ్రీకాకుళం
ఎస్.వి రమణ	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
వి.నేతాజీ	దిశా పిఎస్	డిసిఆర్బి, శ్రీకాకుళం
వి.గోపాలరావు	విఆర్, శ్రీకాకుళం కాశీబుగ్గ అటాచ్డ్	విఆర్, శ్రీకాకుళం
ఎల్.బాలుడు	విఆర్, శ్రీకాకుళం అటాచ్డ్ సిసిఎస్	విఆర్, శ్రీకాకుళం
ఎస్.కేశవరావు	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
ఎస్.శ్రీరంగులు	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
ఎన్.నారాయణ	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
కె.కృష్ణారావు	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
ఎన్.కర్రయ్య	విఆర్, శ్రీకాకుళం	పిసిఆర్, శ్రీకాకుళం
కె.మోహనరావు	విఆర్, శ్రీకాకుళం	పిసిఆర్
ఎం.సురేంద్ర కుమార్	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్
యు.రాజారావు	అనకాపల్లి	విఆర్, శ్రీకాకుళం
ఎం.వెంకటరావు	విఆర్, శ్రీకాకుళం	ఎస్ఐ-2 కాశీబుగ్గ
షేక్ రషీద్	అనకాపల్లి	విఆర్, శ్రీకాకుళం
జె.నాగేశ్వరరావు	అనకాపల్లి	డిపిటిసి, శ్రీకాకుళం
జి.విశ్వనాథం	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్
పి.ప్రసాదరావు	విఆర్, శ్రీకాకుళం	ట్రాఫిక్ పిఎస్
కె.సత్యనారాయణ	అనకాపల్లి	విఆర్, శ్రీకాకుళం
పి.వరి	విఆర్, శ్రీకాకుళం	ట్రాఫిక్ పిఎస్
పి.వి వెంకటరమణ	విఆర్, శ్రీకాకుళం	ఎస్ఐ-2 శ్రీకాకుళం టూటౌన్
షేక్ మదీనా వలి	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్
యు.భవాని	అల్లూరి జిల్లా	దిశా పిఎస్
కె.గోవిందరావు	అల్లూరి జిల్లా	సిసిఎస్
డి.సూరిబాబు	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్
కె.నర్సింగరావు	విఆర్, శ్రీకాకుళం	డిఎస్బి
పి.డి.వి శంకర్	విఆర్, శ్రీకాకుళం	సిసిఎస్
కె.శ్రీనివాసరావు	విశాఖ సిటీ	దిశా పిఎస్
పి.మురళీకృష్ణ	విఆర్, శ్రీకాకుళం	డిపిటిసి

పోలీసులపై ఫిర్యాదులకు ప్రత్యేక అథారిటీ

పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ జిల్లా చైర్మన్ వరప్రసాదరావు



మాట్లాడుతున్న సంస్థ జిల్లా చైర్మన్ వరప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీసులపై చర్యలకు సంబంధించి ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం పోలీసు ఫిర్యాదుల ప్రాధికార (అథారిటీ) సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ జిల్లా చైర్మన్, విశ్రాంత జిల్లా జడ్జి ఎ.వరప్రసాదరావు తెలిపారు. నగరంలోని ఆర్అండ్బి అతిథిగృహంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కస్టడీలో మృతి, దాడి, అత్యాచారం వంటి ఘటనలు చోటుచేసుకున్న సందర్భంలో విచారణ చేపట్టి పోలీసులపై చర్యలకు తమ సంస్థ సిఫార్సు చేస్తుందని చెప్పారు. మానవ హక్కులను ఉల్లంఘించే కానిస్టేబుల్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి వరకు పోలీసు అధికారులపై ఫిర్యాదులను పరిశీలించడానికి జిల్లాస్థాయిలో ఈ అథారిటీ పనిచేస్తుందని తెలిపారు. పోలీసు సూపరింటెండెంట్, అంతకంటే ఎక్కువ స్థాయి అధికారులపై ఫిర్యాదులను పరిశీలించడానికి రాష్ట్రస్థాయి అథారిటీ పనిచేస్తుందని చెప్పారు. ప్రజలను తమ కార్యాలయాలకు పిలిపించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, శారీరక హింస, మాటలతో దుర్భాషలాడడం వంటి ఘటనల్లో సంబంధిత పోలీసు అధికారుల చర్యల కోసం తమకు పిటిషన్లు అందజేయవచ్చని చెప్పారు. తమ అథారిటీకి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అరకు, అనకాపల్లి జిల్లాల పరిధి ఉందని, ఫిర్యాదులు నేరుగా గానీ ఆన్లైన్ ద్వారా గానీ 9494841172 ఫోన్ నంబరును సంప్రదించడం ద్వారా గానీ అందజేయవచ్చన్నారు. 2021 జూలైలో ఏర్పడిన ఈ అథారిటీకి ఇప్పటి వరకు 54 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. నేరం జరిగిందని భావించిన సంవత్సరం లోపు, పోలీసు ఉన్నతాధికారులను సంప్రదించినా ఎలాంటి చర్యలు తీసుకోని ఫిర్యాదులను తాము స్వీకరిస్తామని తెలిపారు. సమావేశంలో అథారిటీ సభ్యులు విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ పి.రజినీకాంతరావు, రెడ్క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత అధికారి కె.రంగరాజు ఉన్నారు.

మున్సిపల్ మేస్త్రీలను సూపర్వైజర్లుగా గుర్తించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ అప్కాస్ జాబితాలో పిహెచ్ వర్కర్లుగా ఉన్న మేస్త్రీలను సూపర్వైజర్లుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్లో పారిశుధ్య మేస్త్రీలుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని తెలిపారు. పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వం క్యాబ్, టి.బి.ఆర్ సంస్థలకు అప్పగిస్తూ 279 జిఒ ప్రకారం సూపర్వైజర్లుగా గుర్తించి రూ.15 వేల వేతనం ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం వారిని ఆప్కాస్కు అప్పగించి సూపర్వైజర్లుగా ఉన్న వారిని పిహెచ్ వర్కర్లు చేర్చడంతో అన్యాయం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారని గుర్తుచేశారు.

వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా వచ్చిన శానిటేషన్ సెక్రటరీలతో సమానంగా సూపర్వైజర్లు కూడా 151 జిఒ ప్రకారం డోర్ టు డోర్ గార్బేజ్, చెత్త పన్నుల వసూలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పనివేళలను లెక్క చేయకుండా రాత్రీ పగలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకొంటూ విధులను నిర్వహిస్తున్నారని చెప్పారు. మేస్త్రీలను సూపర్వైజర్లుగా గుర్తించి కేటగిరి-2లో ఆప్కాప్ జాబితాలో చేర్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేస్త్రీలు ఎం.రామారావు, జి.మోహనరావు, సంతోష్ కుమార్, రాజారావు, తిరుపతిరావు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
SUCCESSION OP.No.02/2024

Between:
1) Gali Gurayya
2) Kolli Chinnammadu --Petitioners
And:
-Nil- --Respondents

GENERAL PUBLIC NOTICE

The public in general are hereby called upon to raise any objections to issue "Succession Certificate" in favour of the above named petitioners in the above numbered S.O.P.No.02/2024 on the file of the Honourable Principal Senior Civil Judge at Srikakulam. In the event of if any successors are there such persons may appear before the above said court with necessary documents if any either in person or through an Advocate to raise objections if any on **27-02-2024 at 10-30A.M.** before the above mentioned Court. Otherwise the Honourable Court will pass decree by issuing "Succession Certificate" in favour of the above named Petitioners to declare them as only successors to the deceased Smt. GALI SATTAMMA.

NULU SITA RAMA RAO
NULU SARATH KUMAR
ADVOCATES,
SRIKAKULAM,
CELL NO: 9490713705.

Srikakulam
Dt:29-1-2024

బహిరంగ ప్రకటన ఖండన

నా క్లయింటు అయిన శ్రీమతి వరుదు కళ్యాణి గారు (గౌరవ శాసనమండలి సభ్యులు) ఇచ్చిన భోగట్టా ప్రకారం, నా క్లయింట్ పైన, నా క్లయింట్ తమ్ముడైన వరుదు దేవీ ప్రసాద్ పై తేది 01-01-2024 న శ్రీ తంగి శివ ప్రసాద రావు, అడ్వకేట్ వారి క్లయింటు అయిన ధర్మాన ధర్మారావు తరుపున బహిరంగ ప్రకటన జారీ చేసి ఉన్నారు. సదరు బహిరంగ ప్రకటనలో పేర్కొన్న అంశములు అన్నియు సత్యదూరమైనవి, అసత్యములైనవి, యధార్థము కావని ఖండిస్తూ ఈ ప్రకటన నా క్లయింటు తరపున జారీ చేయడమైనది.

షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింటు కొనుగోలు చెయ్యడానికి ముందు నా క్లయింట్ తాలుకా విక్రయదారులు సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తికి పూర్తి హక్కుదారులని, నాకు విక్రయించినవారి విక్రయించిన వారికీ 2003వ సంవత్సరంలో క్రయ దస్తావేజు ద్వారా సంక్రమించిన ఆస్తి అయ్యిఉన్నదని, 2003వ సంవత్సరంలో క్రయ దస్తావేజు ద్వారా నాకు విక్రయించిన వారికి పూర్తి హక్కు అనుభవములు కలవని రెవెన్యు రికార్డులలో వారి పేరున నమోదు కాబడియున్నదని, సదరు రికార్డులు అన్ని పరిశీలించిన అనంతరం నా క్లయింటు సదరు భూమిని 2013వ సంవత్సరం కొనుగోలు చేసియున్నారు. సదరు కొనుగోలు చేసిన అనంతరం సదరు భూమిని న క్లయింటు పేరున నమోదు చేయమని రెవిన్యూ అధికారులకు దరఖాస్తు చేయగా సదరు దరఖాస్తుని సమగ్ర విచారణ అనంతరం రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసు బుక్, టైటిల్ డీడ్ మరియు 1B, VA No.3 adangal నా క్లయింటు పేరున రెవిన్యూ రికార్డ్స్ నమోదు చేసియున్నారు. శ్రీ ధర్మాన ధర్మారావు తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి రెవెన్యు కోర్టులలో నా క్లయింటు పైన తప్పుడు కేసులను వేసి సదరు భూములను క్లెయిం చెయ్యగా సదరు కేసులను రెవెన్యు కోర్టులలో తిరస్కరించి, నా క్లయింటు కొనుగోలు చేసిన భూములకు నా క్లయింట్ పూర్తి హక్కుదారుగా నిర్ధారించియున్నారు. అయినప్పటికీ శ్రీ ధర్మాన ధర్మారావు తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు వేస్తూ నా క్లయింట్ను రాజకీయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నందున నా క్లయింటు శ్రీకాకుళంలో పూర్తి కాలం నివాసం ఉండనందున నా క్లయింట్ తమ్ముడు అయిన వరుదు దేవీ ప్రసాద్కు సదరు భూమియొక్క బాగోగులు చూసుకోమని 2013 సంవత్సరమున గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ వ్రాయించి ఇచ్చియున్నారు. అయినప్పటికీ శ్రీ ధర్మాన ధర్మారావు షెడ్యూల్ దాఖలా ఆస్తిని దురాక్రమణ చేయుటకు ప్రయత్నించగా, నా క్లయింట్ తమ్ముడు శ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సదరు భూములను శ్రీ ధర్మాన ధర్మారావు దురాక్రమణ చెయ్యకుండా ఇంజక్షన్ కోరుతూ శ్రీ ధర్మాన ధర్మారావు పైన కేసు దాఖలు చేసినారు. సదరు కేసు విచారణలో ఉండగా సదరు షెడ్యూల్ దాఖలు ఆస్తిని నా క్లయింట్ లీగల్గా కొనుగోలు చేసిన ఆస్తి అయ్యి ఉన్నదని సదరు ఆస్తిని కొనుగోలు చెయ్యుటకు శ్రీ పుట్టా శాంతామణి మరియు శివప్రసాద్లు నా క్లయింట్ను సంప్రదించగా నా క్లయింటు వారు ఆఫర్ చేసిన క్రయ ధనం సరి అయినదని యెంచి, వారికి సదరు ఆస్తిని విక్రయించుటకు అంగీకరించినారు. కొనుగోలుదారులు సదరు ఆస్తిని నా క్లయింటు క్రయ దస్తావేజు వ్రాయించి ఇవ్వమని కోరగా, గతంలో నా క్లయింటుకు ఆమె తమ్ముడైన వరుదు దేవీ ప్రసాద్కు వ్రాయించి ఇచ్చిన రిజిస్టర్డ్ గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ను రద్దు పరుస్తూ నా క్లయింట్ తమ్ముడైన వరుదు దేవీ ప్రసాద్ శ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలు చేసిన కేసును ఉపసంహరించుకొని, సదరు భూమిని 2018వ సంవత్సరంలో పుట్టా శాంతామణి మరియు జి. శివప్రసాద్ లకు రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 2018వ సంవత్సరంలో విక్రయించి, వారికి పూర్తి హక్కులతో స్వాధీనపరిచియున్నారు. సదరు ఆస్తికి పుట్టా శాంతామణి మరియు శివ ప్రసాద్లు పూర్తి హక్కు అనుభవధారులై ఉన్నారు. నా క్లయింట్ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తప్పుడు దస్తావేజులు సృష్టించియున్నారని శ్రీ ధర్మాన ధర్మారావు తప్పుడు ఆరోపణలతో ఎటువంటి చట్టబద్ధత గలిగిన దస్తావేజులు గాని, సాక్ష్యాలు గాని, రుజువులు గాని లేకుండా నా క్లయింట్ అయిన వరుదు కళ్యాణి గారిపై నష్ట పరిహారం కోరుతూ శ్రీ 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు మరియు ఫ్యామిలి కోర్టు లో O.S. No.49/2023 కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు కోర్టులో పెండింగ్లో యున్నది. ప్రకటనలో పేర్కొన్నట్లు శ్రీ ధర్మాన ధర్మారావు సదరు భూమిని ఎ.పి.ఎస్.ఎఫ్.సి. వారికి రిజిస్టర్డ్ తనఖా చేసినట్లు సదరు బ్యాంక్లో ఎటువంటి ఆధారములు కలిగియుండలేదు. అలాగే ఈ ప్రకటనలో పేర్కొన్న అంశములకు ఎటువంటి ఆధారములు గాని, చట్టబద్ధమైన దస్త్రములు గాని శ్రీ ధర్మాన ధర్మారావు కలిగియుండలేదు. నా క్లయింట్లను, నా క్లయింట్ తమ్ముడైన వరుదు దేవీ ప్రసాద్ ను మరియు నా క్లయింటు వద్ద నుండి క్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసినవారికి ఇబ్బందులకు గురి చేసి, బ్లాక్ మెయిల్ చేసి న్యాయబద్ధం కాని ప్రతిఫలము పొందుటకు మరియు సదరు భూమిని శ్రీ ధర్మాన ధర్మారావు అతని పేరున తప్పుడు దస్త్రాలను సృష్టించి సదరు ఆస్తిని కబ్జా చెయ్యుటకు ఈ తప్పుడు బహిరంగ ప్రకటన శ్రీ తంగి శివప్రసాద్, న్యాయవాది ద్వారా ప్రచురించియున్నారు.

కనుక తేదీ 01-01-2024న ప్రచురించిన బహిరంగ ప్రకటనలోని విషయములు తెలిసిన అనంతరము సదరు ప్రకటనలోని అంశములు సత్యదూరములని, నమ్మదగినవి కాదని ఖండిస్తూ నా క్లయింటు తరుపున ఈ ఖండన ప్రకటన జారీచెయ్యడమైనది. తప్పుడు, సత్యదూరమైన ప్రకటన జారీ చేయించినందుకు శ్రీ ధర్మాన ధర్మారావు పై నా క్లైంటు మరియు నా క్లయింట్ తమ్ముడైన వరుదు దేవీ ప్రసాద్ సివిల్ మరియు క్రిమినల్ చర్యలు రెండింటినీ చట్టపరంగా తీసుకొనుటకు నిర్ణయించుకున్నట్లు ఈ ప్రకటన ద్వారా ధర్మాన ధర్మారావుకు తెలియజేయడమైనది.

ఇట్లు
కోత తిరుమలరావు, అడ్వకేట్,
శ్రీకాకుళం, ఫోన్:9440550455.

శ్రీకాకుళం
తేది: 29-01-2024



ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

'ఆడుదాం ఆంధ్రా' చక్కని అవకాశం

ప్రజాశక్తి - నరసన్నపేట

ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు ఒక చక్కని అవకాశమని, ఈ పోటీల్లో సత్తాచాటి నరసన్నపేట కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఫైనల్ పోటీల విజేతలకు బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగనన్న ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. అందులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగ అవకాశాలతోపాటు పేరు ప్రఖ్యాతలు లభిస్తాయన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడాకారులందరూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, వైస్ ఎంపిపి పాగోటి రాజారావు, నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరెల్ల శంకర్, అటవీ శాఖ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, ఎంపిడిఒ కె.మధుసూదనరావు పాల్గొన్నారు.




ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పోలీసు స్పందనకు 43 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనకు 43 వినతులు వచ్చాయని ఎస్‌పి జి.ఆర్.రాధిక తెలిపారు. అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామిలతో కలిసి ఫిర్యాదు దారుల నుంచి సోమవారం అర్జీలను స్వీకరించారు. కుటుంబ తగాదాలు ఆరు, పౌర సంబంధమైనవి ఆరు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఐదు, పాతవి ఐదు, చిటింగ్ మూడు, సైబర్ నేరాలకు సంబంధించిన ఆరు, ఇతరత్రా 12 ఫిర్యాదు అందాయని అన్నారు. అర్జీదారుల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరినీ అర్జీలు విషయాలు అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా సమాచారం అందించి ప్రజల ఫిర్యాదులను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే ఎస్‌పి కార్యాలయానికి నివేదించాలని అందించాలన్నారు.

ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే 'ఆసరా'



శ్రీకాకుళం : నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా దోహదపడిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార ఎంపిడిఒ కార్యాలయంలో, శ్రీకాకుళం మండలం తండ్యావలస, నగరంలోని బలగ, పిఎన్‌ఎంఎం స్కూల్ ఆవరణలో సోమవారం వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల కాలంలో నాలుగు విడతల్లో ఆసరా పథకం ద్వారా మహిళల ఖాతాల్లోకి నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఆసరాతో మహిళల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా స్త్రీల జీవితాల్లో భరోసా నింపిన ఏకైక ప్రభుత్వం వైసిపిదేనని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చగలిగామన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించామని చెప్పారు. అనంతరం ఆసరా నమూనా చెక్కులను అందజేశారు. అంతకుముందు నగరపాలక సంస్థ పరిధిలోని బలగ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రం వద్ద రూ.నాలుగు కోట్లతో నిర్మించిన 5 ఎంఎల్‌డి ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ, కలెక్షన్ వెల్, పంప్‌హౌస్, వాటర్ వర్క్స్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. వైసిపి నాయకులు రామ్‌మనోహర్ నాయుడు, డిఆర్‌డిఎ పీడీ విద్యా సాగర్, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపిలు గొండు రఘురాం, అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మార్పు సుజాత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైసిపి శ్రీకాకుళం రూరల్ మండలాధ్యక్షులు చిట్టి జనార్దనరావు, పీస గోపి, ఎంపిటిసి [illegible] మాకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆసరా ఎంతో తోడ్పడుతుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలో కేశవరెడ్డి స్కూల్ సమీపంలో సోమవారం ఆసరా 4 విడత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమమాలినిరెడ్డి, ఎంపిపి మొదలవలస చిరంజీవి, సనపల నారాయణరావు, యువజన విభాగం అధ్యక్షులు కొత్తకోట సూర్యారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్‌ఆర్ ఆసరా పథకం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కళింగ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి ఎంపి అభ్యర్థి పి.తిలక్ అన్నారు. మండలంలోని 986 స్వయం సహాయక సంఘాల్లో 10647 మంది మహిళలకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఊర్రన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌లు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నర్తు శివాజీ, పూడి నీలాచలం, కర్రి గోపయ్య, ఎలమంచి నీలయ్య, పాండవ శేఖర్, దువ్వు కృష్ణారెడ్డి, దుగాన భద్రాచలం పాల్గొన్నారు.

వెనుదిరిగిన మహిళలు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ కోసం డ్వాక్రా మహిళలకు నిరీక్షణ తప్పలేదు. ఉదయం 10 గంటలకే ఆసరా సమావేశం ఉందని చెప్పడంతో సభా ప్రాంగణానికి ఉదయం 9 గంటల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అయితే 11.30 వరకు ఆమె వచ్చారు. మూడు గంటలకు పైగా నిరీక్షిస్తున్న మహిళలు ఒక్కొక్కరూ జారుకోడం ప్రారంభించారు. పరిస్థితి గమనించిన ఎంపిపి ప్రతినిధి ప్రసంగాలు కుదించి చైర్‌పర్సన్‌కు మైక్ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఉండగానే మహిళలు ఒక్కసారిగా లేచిపోవడంతో సమావేశం ముగించాల్సి వచ్చింది. దీంతో సమావేశానికి మహిళలు హాజరైనా చైర్‌పర్సన్ సమయపాలన పాటించకపోవడంతో అంతా బూడిదలో పోసిన పన్నీరైందనే విమర్శలు వినిపించాయి.



కవిటి : బయటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న మహిళలు

అధికారుల తీరుపై మహిళల మండిపాటు

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన ఆసరా సభలో అధికారులు నానా అవస్థలు పడ్డారు. నాలుగు విడత ఆసరా నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌లు నిర్వహించారు. సమావేశానికి వచ్చిన పొదుపు మహిళలు ఆసరా డబ్బులు ఖాతాల్లో జమవుతాయని, లేకుంటే ఆ డబ్బులు జమకావని సిఎఫ్‌లు ద్వారా మహిళలకు చెప్పి వారికి భయపెట్టి రాప్పించారు. తీరా వచ్చాక కూర్చోవాలంటే కుర్చీలు లేవు, నిల్చుందామంటే నీడలేదు, తాగుదామంటే నీరు లేదని డ్వాక్రా మహిళలు వాపోయారు. దీంతో పక్కన ఉన్న టిడిపి కార్యాలయ ఆవరణలో అన్నా క్యాంటీన్‌లో డ్వాక్రా మహిళలు అకలితీర్చుకుని ఇంటికి వెళ్లారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

19న రైస్, ఆయిల్‌మిల్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైస్ అండ్ ఆయిల్ మిల్ కార్మిక సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 19న జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని శ్రీ చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ హెచ్ ఈశ్వరరావు కో-కన్వీనర్ ఎం.సూరయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలో సిఐటియు కార్యాలయంలో రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ రైస్ అండ్ ఆయిల్ మిల్ కార్మికులు జిల్లాలో సుమారు 5వేల మంది ఉన్నారని, వీరు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ, 8 గంటల పనిదినం తదితర కార్మిక చట్టాలు అమలు చేయకుండా ప్రభుత్వ అండతో యాజమాన్యాలు తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఐఎల్‌ఒ నిబంధనల ప్రకారం 50 కేజీలు బస్తాలు మాత్రమే వాడాలని, ప్రభుత్వం 100 కేజీలపైన బస్తాలు ఉపయోగించడం వల్ల కళాసీలు బరువులు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఐఎల్‌ఒ నిబంధన ప్రకారం 50 కేజీల బస్తాలు ఉపయోగించాలని వారు డిమాండ్ చేశారు. రైస్ మిల్ కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 19న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అత్యధిక మంది కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు గుండ నీలన్న, రఘునాథ్ పాల్గొన్నారు.



ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి



అన్నయ్య మృతదేహం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని కరజాడకు చెందిన బమ్మిడి అన్నయ్య (54) సోమవారం ఆటో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. అన్నయ్య తమ బంధువులైన హరి దాసురం పరామర్శించేందుకు వేరే గ్రామానికి చెందిన ఆటో వెనుక భాగంలో కూర్చున్నారు. ఆటో అతివేగంగా వెళ్లడంతో వెనుక కూర్చున్న అన్నయ్య, బమ్మిడి జగన్నాథంలు ముక్తాపురం వద్ద జారిపడి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో అప్పన్న తీవ్రంగా గాయపడగా, జగన్నాథం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడిని కరజాడ పిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి...

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి సోమవారం ఉదయం గుర్తుతెలియని యువకుడు (27) మృతి చెందినట్లు జిఆర్‌పి హెచ్‌సి చక్రధరరావు తెలిపారు. మృతుడు ఎరుపురంగు టీషర్టు, నలుపురంగు నైట్‌ప్యాంట్‌ను ధరించాడని, మృతుడు చామనఛాయ రంగు కలిగి గొంతు, పొట్టపైన పుట్టుమచ్చలు ఉన్నాయన్నారు. మృతుడు రైలు నుంచి జారిపడి ఉండవచ్చునని, దీంతో తల వెనుకభాగం నుజ్జునుజ్జుకాగా, కాళ్లు విరిగిపోయి ఉన్నాయని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9491106219 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



బోల్తా పడిన ఇసుక లారీ

ఇసుక లారీ బోల్తా

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలో చెవ్వాకులపేట వద్ద వంశధార నది నుంచి తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్న ఇసుక లారీలు తరచూ బోల్తా పడుతుందడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వేకువజామున ర్యాంపు నుంచి ఇసుకలోడుతో వెళ్తున్న లారీ రామచంద్రాపురం గ్రామ సమీపంలో పంట పొలాల్లో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న ఇసుక ర్యాంపు నిర్వాహకులు అక్కడ ఒక చేరుకొని క్రేన్ సహాయంతో లారీని పొలం నుంచి రోడ్డుపైకి తీసి యధావిధిగా ఇసుక వ్యాపారాన్ని కొనసాగించారు. చెవ్వకులపేట ఇసుక ర్యాంపు నుంచి విశాఖపట్నం రవాణా చేస్తున్న ఇసుక లారీలు ఇదే రహదారిలో ప్రతిరోజు రాకపోకలు కొనసాగిస్తున్నాయని పలుమార్లు బోల్తా పడుతుండడంతో పాటు పలువురికి గాయాలు కూడా అవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజ్ఞా వికాస్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - కొత్తూరు

ఫిబ్రవరి 6 7 8 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.హరీష్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు ఒక మైలురాయిగా చేసుకోవాలన్నారు. ఇందులో వారి ప్రతిభను తెలుసుకొని భవిష్యత్‌లో వారు రాయబోయే ప్రథమ పబ్లిక్ పరీక్షకు ఈ పరీక్షలు ఒక కసరత్తులా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆబ్జెక్టివ్ రూపంలో 100 మార్కులకు ఉంటుందని తెలియజేశారు. ఈ వంద మార్కుల ఆబ్జెక్టివ్ పరీక్షలో వారు చదువుకునే పాఠ్యాంశాల్లో ఉండే అన్ని సబ్జెక్టుల మోడల్‌లో వచ్చే విధంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్తూరులో ఫిబ్రవరి 8న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజు, యొహన్, కమిటీ సభ్యులు జ్ఞానేశ్వరి, బాలు అరుణ్ పాల్గొన్నారు.

పేకాటలో పట్టుబడితే రౌడీషీట్ తెరుస్తాం



మాట్లాడుతున్న సిఐ వేణుగోపాలరావు

సిఐ వేణుగోపాలరావు

ప్రజాశక్తి - కొత్తూరు

పేకాట ఆడి పట్టుబడితే రౌడీషీట్ తెరుస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వచ్చే జాతర్లలో పేకాట గాని, లాటరీ పిక్కలు గాని ఆడేందుకు అనుమతులు లేవని పేర్కొన్నారు. ఒకవేళ అటువంటి ఆటలు ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, సంబంధిత ధ్రువపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.పది వేలు అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒంటరిగా మహిళలు ప్రయాణం చేయరాదని కోరారు. అకౌంట్ వివరాలు, ఓటిపి నంబరు, పిన్ నంబరు, ఆధార్ నంబర్లు ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. ఒడిశా సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈయనతో పాటు ఎస్‌ఐ అహ్మద్ ఉన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - పొందూరు

అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని ఆమదాలవలస ఐసిడిఎస్ పిఒ గీతాశ్రీ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణంలో అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో ప్రీస్కూల్ కార్యక్రమాలను తప్పనిసరిగా జరపాలని, మెనూ పాటించడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు లీలారాణి, రమాదేవి, అన్నమ్మ, అనూరాధ పాల్గొన్నారు.



అంగన్వాడీలతో మాట్లాడుతున్న సిడిపిఒ గీతాశ్రీ

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

సరుబుజ్జిలి : విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణ ద్వారా వారి జీవిత లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు మాట్లాడుతూ 50 రోజుల జయీభవ కార్యక్రమం చేపట్టి, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌ను దిశానిర్దేశం చేసే దశ ఇంటర్మీడియట్ అని, ఈ వయసులో చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.నాగేంద్ర, రామకృష్ణ, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు, విజయ, సంగీత, గౌతమి, విజయ్, తారాచంద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు



మాట్లాడుతున్న గిరిబాబు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో చెత్తపేరుకు పోవడానికి, పారిశుధ సమస్య ఎక్కువగా కావడానికి ప్లాస్టిక్ కారణమని, ప్లాస్టిక్ విక్రయాలను నిషేధించి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కోరారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ సనపల సింహాచలం మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ స్పందిస్తూ ప్రతి సభ్యునీ ఆమోదంతో ప్లాస్టిక్ నిషేధంపై తీర్మానం చేస్తున్నామని, కమిషనర్ నాగేంద్రకుమార్ ఆధ్వర్యాన ప్లాస్టిక్ విక్రయాలు, విని యోగంపై ఉక్కుపాదం మోపి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దు తామని తీర్మానించారు. టిడిపి కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, వైసిపి కౌన్సిలర్ బోర చంద్రకళ మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పవర్ బోర్లు, బోర్లు చాలా ప్రాంతాల్లో మరమ్మతులకు గురయ్యాయని, తక్షణమే మరమత్తులు చేపట్టాలని కోరారు. దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ ఉద్దానం తాగునీటి పథకం నుంచి పైపులైన్ మున్సిపాలిటీకి కలిపితే వేసవిలో నీటి ఎద్దడి ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టాలని సూచించారు. చైర్మన్ స్పందిస్తూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ ముత్యాలమ్మకోనేరు నెహ్రూ పార్కు అభివృద్ధి చేయడం ఆనందదాయకమని, అదే విదంగా తమ వార్డు పరిధిలోని భద్రమ్మకోనేరు పార్కులో కూడా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్ గుజ్జ జోగారావు మాట్లాడుతూ తమ వార్డులో గడపగడప పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు ఇంజినీరింగ్ సిబ్బంది సహకరించక పోవడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు. కౌన్సిలర్లు సవర సోమేశ్వరరావు, బడగల సుజాత, తంగుడు ఆశాలత, జోగ త్రివేణి. అంబటి మాధురి, బల్ల రేవతి, పప్పల ప్రసాద్. పి.అజయ్, దున్న నిర్మల పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న నాగేశ్వరరావు

సమాజ సేవే లక్ష్యం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విద్యార్థి దశ నుంచే సమాజ సేవే లక్ష్యంగా పనిచేయాలని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని చాకిపల్లికొత్తూరులో ఐతమ్ ఎన్‌ఎస్‌ఎస్ సేవా విభాగం ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. ఈ సేవా శిబిరంలో మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరం, గ్రామంలో పరిశుభ్రతపై, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించడం వంటివి చేపడతారని వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఈ వారం రోజుల పాటు శ్రద్ధగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనా లని డైరెక్టర్ కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, పిఒ డాక్టర్ బి.బలరాం, సర్పంచ్ వాన తవిటయ్య, పొందల దేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ

అన్ని తరగతులకు సమ న్యాయం

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్ని తరగతులకూ సమ న్యాయం చేస్తుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అన్వేష్ అధ్యక్షతన క్రిస్టియన్ సంఘ భవనంలో చర్చ్ పాస్టర్లతో సోమవారం ముఖముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ఒక తరగతి, ఒక ప్రాంతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగు తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. సమావేశం ఫాస్టర్లు అబ్రహం, సుందరరాజు, పాల్, వైస్ చైర్మన్లు భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

కోటబొమ్మాళి: స్థానిక భవిత కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సహిత విద్యా జిల్లా సమన్వయకర్త కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. ఎన్‌టిఆర్, ఎర్రన్నా యుడు పార్కు ఆవరణలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. అలాగే పిల్లలకు జరుగుతున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. ఐఇఆర్‌టిలు దేవమని, శరత్‌చంద్రిక, ఫిజియోథెరపిస్టు జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

టిడిపి విజయానికి టిడిపి మండల క్లస్టర్లు, యూనిట్ బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు అసిరితల్లి కళ్యాణ మండపంలో మండలం క్లస్టర్ల, యూనిట్ బూత్ లెవెల్ ఏజెంట్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారాయణ చంద్రబాబునాయుడు భవిష్యత్ ప్రణాళికకు సంబంధించిన అంశాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. అర్హులైన ఓటర్లు అందరూ ఓట్ల జాబితాలో ఉండేలా చూడాలన్నారు. కుటుంబ సాధికార సారథులు, యాప్ ఎన్రోల్మెంట్, ఓటర్ వెరిఫికేషన్ పొలిటికల్ అండ్ టెక్నికల్ కెఎస్‌ఎస్ నియామకం, మన టిడిపి యాప్ తదితర అంశాలపై సమగ్రంగా శిక్షణ ద్వారా తెలియజేయాలని నియోజకవర్గ పరిశీలకులను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శీర రమణయ్య, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి బలగ చెంగాలరావు, నియోజకవర్గ బిసి అధ్యక్షులు గేదెల శ్యామ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలు ఆందోళన విరమించినా గ్రామాల్లో వారి సేవలను పునరుద్ధరించడానికి అనువైన పరిస్థితులను ప్రభుత్వం తీసుకురాలేదని, తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని పొందూరు మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ నవీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎచెర్ల నియోజకవర్గం పరిధిలో తమ్మినాయుడు పేట నుంచి పైడి భీమవరం వరకు విస్తరించి ఉన్న 16వ నెంబర్ జాతీయ రహదారి చాలావరకు అనేక చోట్ల కృంగిపోయిందని, రోడ్డు కృంగిపోవడం వలన వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు బిల్లులు సకాలంలో చెల్లించి రైతులకు సహకరించాలని కోరారు. వృధా నీరుతో అధ్వానంగా మారిన రణస్థలం మండలం మెంటాడ గ్రామ మెయిన్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, డి.మత్స్యలేశం గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని కోరారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న అప్పలనాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న విసి రజని

వర్సిటీ విభాగాల తనిఖీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ విభాగాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజని సోమవారం తనిఖీ చేశారు. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లోని విభాగాలను, కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యాలయాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా సమయపాలన పాటించాలని సూచించారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు పనివేళల్లో విభాగాల్లోనే ఉండాలన్నారు. అదేవిధంగా కొన్ని కోర్సులకు జరుగుతున్న మిడ్ ఎగ్జామ్స్‌ను పరిశీలించారు. ఈమె వెంట రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య ఉన్నారు.



ట్యాబ్‌లను అందిస్తున్న ఈశ్వరరావు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ బడులు నిలవాలని సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దిలీప్ కుమార్ సాహు అధ్యక్షతన 8వ తరగతి విద్యార్థులకు సోమవారం టాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్పు చేశారని అన్నారు. వచ్చే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, గ్రామస్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థను కాపాడుకునేందుకు ఈ నెల 30న గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్‌ల శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. నగరంలో విశాఖ ఎ కాలనీలో కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గాంధీజీ పార్కులో చేపట్టనున్న ఈ నిరసనకి ఉమ్మడి జిల్లాకు చెందిన సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌ల వ్యవస్థ వైసిపి ప్రభుత్వపాలనలో మనుగడ కోల్పోయిందన్నారు.

వృత్తి నైపుణ్యం అవసరం


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో జిల్లా సాయుధ పోలీసు బలగాలకు 15 రోజుల పాటు నిర్వహించే మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట పరిధిలో వస్తున్న మార్పులు, శాంతిభద్రతల్లో కొత్తగా తలెత్తే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న రోజుల్లో విధుల్లో ఎదుర్కోబోయే అవరోధాలను అధిగమించే విధంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులలో మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. కొత్త విషయాలు తెలుసుకొని నూతన ఉత్తేజంతో వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఎఆర్ సిబ్బందికి ఏటా మొబిలైజేషన్ కార్యక్రమం ఒక రీఫ్రెష్‌మెంట్ కోర్సు వంటిదన్నారు. రోజువారీ విధుల్లో నైపుణ్యం, శారీరక దారుఢ్యం మెరుగుపరచడం అవసరమని చెప్పారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎఆర్ సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యంగా ఉండడానికి యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఉన్న సమయంలో ఉద్యోగంతో పాటు కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, ఎఆర్ డిఎస్‌పి కె.ఎస్ నివాసన్, ఆర్‌ఐలు డి.సురేష్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ కృషి


మాట్లాడుతున్న నరసింహులు

ప్రజాశక్తి- రణస్థలం

అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ కృషి చేస్తుందని ఎపిటిఎఫ్ రణస్థలం, లావేరు మండల గౌరవ అధ్యక్షులు పున్నాన నరసింహులు నాయుడు అన్నారు. మంగళవారం మండలంలో పున్నానపాలెం, సంచాం, తిరుపతిపాలెం, అర్జునవలస, గిరివానిపాలెం, వేల్పురాయి, దేవరాపల్లి, కమ్మసిగడాం, యాగాటిపాలెం, లోచర్లపాలెం తదితర గ్రామ పాఠశాలల్లో ఎపిటిఎఫ్ బృందం విస్తృతంగా పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలకు నిలబడి, హక్కులకు కలబడడం ఎపిటిఎఫ్ ధ్యేయమన్నారు. ప్రభుత్వం వాస్తవాలను పరిశీలించి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ ప్రతినిధులు బొంతు అప్పలనాయుడు, వెలమల రమణ, బాలి సూర్యనారాయణ, కె.నూతన పాల్గొన్నారు.

గ్రామ జల సంఘాల ద్వారా పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి రక్షిత మంచినీరు అందించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణతో చేపడుతున్న జలజీవన్ మిషన్ ప్రాజెక్టు పనులు గ్రామ జల సంఘం కమిటీల ద్వారా చేపడుతున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు పెండింగ్ ఉన్న గ్రామాల్లో, జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇకపై కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో పాటు తొమ్మిది మంది స్వయంశక్తి సంఘ సభ్యులతో ఏర్పాటైన గ్రామ జల సంఘాలకు జాతీయ బ్యాంకుల్లో ఖాతా ఓపెన్ చేయించాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చంద్రమౌళి మాట్లాడుతూ టెక్నికల్ సపోర్టును ఇచ్చి ఎం. బుక్ రికార్డు చేసే బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకే ఉంటుందని తెలిపారు. మండల ఇంజనీరింగ్ అధికారి జ్యోతి మండలంలో పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసిపిని ఓడించేందుకు సిద్ధం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: వైసిపిని ఓడించేందుకు మేము సిద్ధమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ సవాల్ చేశారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే నివాసం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల భీమిలిలో జరిగిన సభలో కురుక్షేత్ర యుద్ధం మొదలైందని సిఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. మరో 74 రోజుల్లో వైసిపికి చరమగీతం పాడి సిఎంను గద్దెదించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. మద్యపాన నిషేధమంటూ అధికారంలోకి వచ్చి నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు రెండు నెలలకు రూ.200లు విద్యుత్ బిల్లు వస్తే... ఇప్పుడు నెల రోజులకే రూ.2000 బిల్లు వచ్చే పరిస్థితి వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. సమావేశంలో సూరాడ చంద్రమోహన్, నందికి జాని పాల్గొన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి


పోస్టర్‌ను అందజేస్తున్న రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

టిడిపిలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుమల వీధి, మేదర వీధి, బొంతల వీధిల్లో సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో ముద్రించిన పోస్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జి.చిట్టిబాబు. పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఉప్పరపేటలో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యరకమంలో మాజీ సర్పంచ్ పూజారి శైలజ, టిడిపి నాయకులుఉప్పాడ జయరాం, కోట అప్పన్న, మెట్ట సోమేశ్వరరావు, సదునుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెంతు ఒరియాలకు న్యాయం చేయాలి


ఆందోళన చేస్తున్న బెంతు ఒరియాలు

కంచిలి: ఏళ్ల తరబడి కుల ధ్రువీకరణ కోసం పోరాటం చేస్తున్న బెంతు ఒరియా కులస్తులపై పాలకులు నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని, సత్వర నిర్ణయం తీసుకోకుంటే సహించేది లేదంటూ నియోజకవర్గంలోని బెంతు ఒరియాలు హెచ్చరించారు. బెంతు ఒరియా సంఘ ప్రతినిధులు డాక్టర్ జగబంధు దొలాయి, రజిని కుమార్ దొలాయి, దేవరాజు సాహు, మోహన్ మజ్జి, సంతోష్ తదితరుల ఆధ్వర్యాన మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముందుగా జెఎంజె పాఠశాల నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులుగా ఉన్న తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ నాశనమవుతుందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమకు ఇచ్చిన ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

బోధన.. ఆయనకు ఆరాధన


గోవిందరెడ్డి, లక్ష్మి దంపతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కొందరికి బోధన ఓ వృత్తి మాత్రమే కావొచ్చు. అయితే ఈ వృత్తిని అమితంగా ఆరాధించే వారు సమాజంలో ఎందరో ఉన్నారు. మంచీచెడు విడమర్చి చెప్పి, క్రమశిక్షణ నేర్పి, విద్యార్థుల జీవిత దిశ, దశను నిర్దేశించే ఉపాధ్యాయులు కుప్పిలి మురళి గోవిందరెడ్డి. ఈ నెలాఖరున సింగుపురంలోని జెడ్‌పి హైస్కూల్‌లో సోషల్ అసిస్టెంట్ గా ఉద్యోగ విరమణ చేయనున్నారు. మూడు దశాబ్దాల కాలం ఉపాధ్యాయ వృత్తికే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన గురించి తెలుసుకుందాం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని హంసవరం ఆయన స్వగ్రామం. తల్లిదండ్రులు కుపిల్లి సన్యాసి, నాగమణిలకు పది మంది సంతానం. అందులో గోవిందరెడ్డి, వ్యవసాయం చేస్తూనే తనకెంతో ఇష్టమైన చదువును ఆయన కొనసాగించారు. ఇక తన అక్కా, బావ గంటా కృష్ణారెడ్డి, జానకి రెడ్డి దంపతులు జిల్లాలోని కళింగపట్నంలో స్థాపించిన స్నో వైట్ విద్యాలయంలో చేరారు. ఈ విద్యా సంస్థలో శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి సైతం ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటుంటారు. స్నో వైట్ విద్యాలయంలో టీచర్‌గా, వార్డెన్‌గా ద్విముఖ సేవలు ఆయన అందించి బిఇడి పూర్తి చేసి ఉద్యోగోన్నతి పొందారు. భార్య లక్ష్మి కూడా స్నో వైట్ విద్యాలయంలో పిల్లల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలూ స్నో వైట్ విద్యాలయంలోనే చదువుకున్నారు. బోధనను ఓ తపనగా భావించి, మెరికల్లాంటి విద్యార్థులను సమాజానికి ఇచ్చిన ఆయనపై ఎందరో ప్రశంసలు కురిపిస్తున్నారు.

అందరికీ అండగా ఉంటాం


మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నందిగాం

తెలుగుదేశం పార్టీ అందరికీ అండగా నిలుస్తుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు హామీనిచ్చారు. మండలంలోని కవిటిఅగ్రహారంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే ఏడాదిలో మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని అన్నారు. ప్రతి మహిళకూ రూ.15 వేలు చొప్పున అందజేస్తామని, నిరుద్యోగ భృతి అందించే బాధ్యత టిడిపి తీసుకుంటుందని భరోసానిచ్చార. కార్యక్రమంలో బంగారు తాత, బంగారు శివ, ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఎస్.జానకిరాం, కె.తాతయ్య పాల్గొన్నారు.

తెలగలను బిసిలో చేర్చాలి

కవిటి: తెలగలను బిసిలో చేర్చాలని మండలం తెలగ తరగతికి చెందిన పెద్దలు కోరారు. ఉత్తరాంధ్ర తెలగ నాయకులు పల్లంట్ల వెంకటరావు ఆదివారం ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించి పాదయాత్ర సోమవారానికి మండలానికి చేరుకుంది. ఈ మేరకు మండలంలోని శిలగాం వద్ద పాదయాత్రకు స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన తెలగలను బిసి జాబితాలో చేరిస్తేనే తమకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముత్యాల రామకృష్ణ, బండారు మిన్నరావు పాల్గొన్నారు.

సోంపేట : తెలగ చేపట్టిన పాదయాత్ర సోంపేట చేరుకుంది. మండలంలోని బూరగాం, బేసి రామచంద్రపురం, కొర్లం, హరిపురం పలాస గ్రామాల్లో పాదయాత్ర కొనసాగుతుందని వారు తెలియజేశారు.

వికలాంగులకు పింఛను పెంచాలి


వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్

టెక్కలి : వికలాంగులకు పింఛను రూ.6 వేలుకు పెంచాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు అందివ్వాలన్నారు. ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పువ్వల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం


దీనారావును సన్మానిస్తున్న మల్లేశ్వరరావు

ప్రజాశక్తి- కవిటి

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న దీనారావుకు సోమవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, అందులో నిబద్ధతతో పనిచేసిన దీనారావుకు సరైన గుర్తింపు లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలో జిల్లాలోని గురుకులాల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ప్రవేశాలకు ఫిబ్రవరి 23వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని గురుకులాల కార్యదర్శి నాయక్ తెలిపారు. మరిన్ని వివరాలకు http://apbrageet.apcfss.in వెబ్‌సైట్‌ను, అంబేద్కర్ గురుకుల విద్యాలయాల ప్రధానాచార్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. మార్చి 10న ప్రవేశపరీక్ష ఉంటుందని వివరించారు. 5వతరగతి ప్రవేశానికి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశానికి 2024 ఆగస్టు 31 నాటికి 17ఏళ్లు మించకుండా ఉండాలన్నారు. ఈ ఏడాదిలో 10వ తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

ముగిసిన ఎఫ్ఎ-3 పరీక్షలు

టెక్కలి: రాష్ట్ర సమగ్ర విద్యాశాఖ ఆధ్వర్యాన చేపట్టిన ఎఫ్ఎ-3 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 23న ప్రారంభమైన ఈ పరీక్షలు రోజు తప్పించి రోజు నిర్వహించారు. సోమవారం ఆంగ్ల పరీక్షతో ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వీనంలో ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. వీటి మూల్యాంకన పత్రాలు తయారు చేసి ఆన్‌లైన్‌లో మార్కులు పొందుపరిచేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు.

పాఠశాలల సముదాయాలు రద్దు

టెక్కలి : సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన ప్రతినెలా ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేపడుతున్న పాఠశాలల సముదాయాలు ఈ నెల రద్దు చేసినట్లు విశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29, 30, తేదీల్లో నిర్వహించాల్సిన ఈ సముదాయాలు కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

హుకుంపేటలో 'పల్లె పల్లెకు టిడిపి'

వజ్రపుకొత్తూరు : టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ గొరకళ వసంతరావు కోరారు. మండలంలోని పల్లివూరు పంచాయతీ హుకుంపేటలో సోమవారం పల్లెపల్లెకు టిడిపి కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, ఎంపిటిసి చిట్టిబాబు, బిసి సెల్ గోవింద్ పాపారావు, అట్టాడ రఘు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి జగన్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతుల పక్షపాతి సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని సచివాలయ కన్వీనర్లు గురాన చిరంజీవి, మహంతి సత్యనారాయణ అన్నారు. మండలంలో వల్లభరావుపేటలో జగనన్న భూహక్కు పుస్తకాలు సోమవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గడి రమణ, గడి బాబురావు, విఆర్ఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టిడిపితోనే శిష్టకరణాలకు గుర్తింపు

కోటబొమ్మాళి: టిడిపి ప్రభుత్వం హయాంలోనే శిష్టి కరణాలకు అన్ని విధాలా మేలు చేకూరిందని శిష్టకరణాల సాధికారిక సమితి టిడిపి రాష్ట్ర కన్వీనర్ అక్కుమహంతి రాజా అన్నారు. కోటబొమ్మాళిలో శిష్టికరణాల ఇంటింటికీ వెళ్లి సోమవారం ప్రచారం చేపట్టారు. మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు నుంచి, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుతో సహా శిష్టికరణాలకు గుర్తింపునిచ్చారని అన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం శిష్టికరణం జిల్లా కన్వీనర్ బలివాడ సత్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివుని రాంబాబు, డబ్బీరు రఘు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ఇచ్ఛాపురం : జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 ఖోఖో పోటీలకు మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 31-4 వరకు ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగబోవు జాతీయస్థాయి ఖోఖో పోటీలో రెయ్య సరస్వతి, సుంకరి భావన ఆంధ్రా తరుపున పాల్గోనున్నారు. వీరిని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.గగనకుమారి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బత్తుల వెంకటరమణ, బలరాం మహంతి రమేష్, బాలాజీ, లాభాల వెంకటరమణ, శ్రీను, కృష్ణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సముచిత స్థానం కల్పించాలి

పలాస: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఉన్న అగ్నికులకు సముచిత స్థానం కల్పించాలని జిఎస్‌టి విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ జుత్తు తాతారావు, రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ రెయ్యి కోదండకృష్ణ అన్నారు. పలాసలో వారు విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన రెండు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో సీట్లు కేటాయించిన పార్టీలకు రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీకే సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి రంగాల్లో యువత ముందుండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.